# అతనూ....!

రచన:
శ్రీ పిల్లా సుబ్బారావుశాస్త్రి

అతణ్ని అంతా హీనంగా చూస్తారు. అతణ్నిచూసి ఏవగించుకు ప్రక్కకు తప్పుకుంటారు. ఆడవాళ్లు చెవులు కొరుక్కొని, బుగ్గలునొక్కుకుంటారు. కొందరు వింతగా చూస్తారు, మరి కొందరు హేళనగా నవ్వుతారు అతన్నిచూసి.

ఆయన బజారువచ్చి కొట్టుకు దూరంగా నుంచుంటాడు. కొందరు దుకాణదారులు ఆయన్ని 'ఏవండీ' అంటారు. కొందరు 'ఏవయ్యా' అంటారు. ఇంకాకొందరు 'దారికడ్డు లేవయ్యా! మరోకొట్టుకు ఫో...!' అంటారు. ఆయనమాత్రం యెవరుయేమన్నా చలించడు. దుకాణంలో ఆయన డబ్బులు చేతికందివ్వడు, క్రింద పెడతాడు. వాళ్ళుకూడా క్రింద పెట్టిన సరుకుల్ని సంచితో పెట్టుకు వెళిపోతాడు.—ఇలా అతణ్ని చూడటానికి ఆయనచేసిన నేరం యేవిటి...?

అతణ్ని ఒకనాడు కలుసుకున్నాను. ఆయన నన్నెంత గౌరవంగా కుర్చీలో కూర్చోబెట్టాడు. 'కొంచెం మంచినీళ్లు యిస్తారా?' అన్నాను.

"అలా, దొడ్లోకివెళ్లు, పంపువుంది...!" అన్నాడతను. ఏవిటి మర్యాదా? నాకుముందు కోపంవచ్చింది. తర్వాత తెలుసుకున్నాను అతనలా అనడానికి కారణం.

"నాయనా! నువ్వింకా చిన్నవాడివి...! నీకేవీ తెలీదు, నాగాధని చెప్పమన్నావు. నీకెందుకు నామీద యింతదయ కలిగిందోకాని...! విను—

నేనూ ఒక బ్రాహ్మణ్నే...! కాని యిప్పుడుమాత్రం...పాకీవాణ్ని...! మానాన్నగారు ప్లీడరు...న్యాయంగా బ్రతికారో, అన్యాయంగా బ్రతికారో తెలీదు...! డబ్బు కేటువంటి లోటూ వుండేదిగాదు. మేము విజయవాడలో వుంటూండేవాళ్ళం.

మాఅమ్మా నాన్నగారికి నేను చాలాకాలాని నలుగురుపిల్లలు తర్వాత పుట్టేను...! భూమిమీద వుండిందిగూడా నేనే! నాముందు వాళ్ళు, నాతర్వాత వాళ్ళుకూడా భూదేవి గర్భంలో కలిసిపోయారు! అమ్మా, నాన్నా నన్నెంతో ముద్దుగా పెంచుతూవచ్చారు. ఈ వూళ్ళో మాతాతగారు వుంటూవుండేవారు.

నేను పెద్దవాణ్నయ్యాను. S.R.R. & C.V.R కాలేజీలో చదువుకుంటూండేవాణ్ని...!—ఇక యిక్కణ్నుంచే నాకు కష్టకాలం బయలుదేరిందని చెప్పాలి!

అదిగో...! ఆనీళ్ళ బిందె తెస్తున్నాదే, ఆమే 'దుర్గ'. వీధి హాల్లో న్యూస్ పేపర్ పట్టుకు పడక కుర్చీలో కూర్చొని చదువుకునే వాణ్ని...! నాకు వీధిలో వెళ్ళే జనం, పోయే జనం కనిపిస్తూవుండేవారు.

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితం. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవి కావు. రచయితల రచనలకు మేము బాధ్యులుకాము.

—సంపాదకుడు

దుర్గ మావీధి తుడిచే పిల్ల. దుర్గ పాకీది! పాకీది అయితే మాత్రం ఎంత అందంగా వుండేది...? గుండ్రని ముఖం. చంపకు చారెడేసి కళ్లూ, పెద్ద ముక్కు,—పట్నంలో పాడే వాళ్లని నువ్వు చూసే వుండవచ్చు...! వాళ్లు మనకంటె ఎంతో శుభ్రంగా వుంటారు, ఎన్నో రెట్లు విలువయిన బట్టలు వేసుకొంటారు...! ఎవరయినా జమీందారు బిడ్డ అనుకోవాల్సిందే...!—పాకీవాళ్ళు మాత్రం మనుషులు కారా? 'వాళ్లకెంత గర్వం...?' అనొచ్చు. వాళ్ళలోనూవున్నారు మంచివాళ్ళు. అయితే వాళ్లలో మూఢత్వంవుంది. కాని నాకు అ మూఢత్వం దుర్గలో కనిపించలేదు.

దుర్గ నావైపు చూసేది. నేనూ దుర్గని చూసేవాణ్ణి. "ఇదో, పిల్లా! రోడ్డు సరిగా తుడవకుంటే. రిపోర్టు చేస్తాను" అనేవాణ్ణి.

"తుడవకుంటేకదా...!" అని నవ్వి వెళ్ళిపోయేది. అందరిలాగ. అక్కడొక చీపురు, ఇక్కడో చీపురు లేసిదిగాదు! ఎంతో శుభ్రంగా రోడ్డు తుడిచేది. నేనూ 'దుర్గని' ప్రతీరోజూ ప్రొద్దుటే చూసేవాణ్ణి...! చూడనిదే వుండలేకపోయేవాణ్ణి...!

దుర్గ గుమ్మంలో నుంచోవాలని తెల్లకాగితాలన్నీ చించి గుమ్మంముందు పోసేవాణ్ణి.

"బాబుగారికి, చదువెక్కువయిపోయిందే...!" అని నావైపు చిలిపిగా చూసేది. 'నువ్వే అత్తయ్య కూతురివయితే ఎంత బావుండేది...!' దుర్గని చూసి మనసులో అనుకునే వాణ్ణి.—ఛీ! అత్తయ్య కూతురు దెయ్యమే! దాన్ని పెళ్లి చేసుకోవడం?—అంతకంటే ఉరిబోసుకు చావడం మేలు.

నాన్నగారికి నాకు యీ పెళ్లి విషయంలోనే తగువు వచ్చింది! నాన్నగారు అత్తయ్య కూతుర్ని పెళ్లిచేసుకోమన్నారు. నేను ఒప్పుకోలేదు!—పాకీవాళ్ల యిళ్ల దగ్గరికి వెళ్లాను. దుర్గ కనిపించింది. నన్ను చూసి పరిగెత్తుకు వచ్చింది.

'ఏం, బాబూ! ఇలా వచ్చారు...?' నన్ను ప్రశ్నించింది. 'ఏమీ లేదు' అన్నాను. దుర్గ అక్కడేనుంచుంది.

"ఒచ్చే ఆదివారం మీ పెళ్లంటగదూ!' అంది దుర్గ.

'ఎవరు చెప్పారూ...?'



'మీకు తెలీదా...?'

'ఉఁ హుఁ...!'

'పెళ్లి నిశ్చయమయిందట. చంద్రమ్మ గారంటగా...!'—నాన్నగారు నాకు చెప్పకుండా పెళ్లి మావయ్య కూతురితో నిశ్చయించారు.

'ఛీ...!' అన్నాను. 'ఏం బాబూ! యిష్టం లేదా?' అన్నాది నా కళ్లలోకి చూస్తూ. 'ఉఁ...! అన్నాను.

'మరెవర్ని చేసుకుంటారూ...?'

'ని...న్ను...!' అప్రయత్నంగా నా నోటి వెంట రెండు అక్షరాలు, బయట పడ్డాయి.

'బాబూ...! నన్ను...అవమానిస్తున్నారు గదూ!'—దుర్గ ముఖంలో దుఃఖం, కోపం రెండూ కనిపిచ్చాయి. 'లేదు, నిజమే...'—మొత్తం మీద దుర్గనే 'రిజిస్టర్ మేరేజి' చేసుకున్నాను.

నన్ను నాన్నగారు యింట్లోనుంచి తగిలేశారు. అమ్మకి గుండె నొప్పివుంది. నా పెళ్లి వషయం విని గుండె ఆగి చచ్చిపోయింది...! నాన్నగారు చాలా పట్టుదలగలవారు. నన్ను చూడనయినా లేదు.

పదిహేను రోజులు జబ్బుపడి, నన్ను తలుచుకుంటూనే ప్రాణాలు విడిచారు. కాని తనశవంనికూడా నన్ను చూడనివ్వవద్దని చెప్పారు! చివరికినా...న్నగారి శవంకూడా... చూడ...లేక పోయాను...! నా సుఖం కోసం కల్లి దండ్రులిద్దర్నీ దూరం చేసుకొన్నాను.

ఆత్మహత్య చేసుకుందుకు బయలుదేరాను క్రిష్ణకి—! 'మీసుఖం కోసం తల్లి దండ్రులని పొట్టన బెట్టుకున్నారు! నన్నుకూడా అన్యాయం చేస్తారా—?' అంది దుర్గ.

దుర్గ కోసం తల్లి దండ్రులని దూరం చేసుకున్నాను. ఆదుర్గనే—అన్యాయం చేస్తానా?

తర్వాత యీ వూరు వచ్చేశాను! ఈ వూళ్లోకూడానన్నంతాయిలా దూషిస్తున్నారు. 'లోకులు కాకులు తిట్లు కొట్టవు! గాలిలో కలిసిపోతాయ్!' అంది దుర్గ. అదో వాళ్ళిద్దరూ నా పిల్లలే! నన్ను గురించి అడిగిన వాడివి నువొక్కడివే! అయిపోయిందిజీవితం! ఎన్నాళ్లో బ్రతకను. బ్రతికినంత కాలంయింతే!' ఆయన చెప్పిన కథనే నేను వ్రాశాను. అంతే!

